క్లుప్తంగా

హుస్సేన్ నగర్‌లో గ్రామోదయం



పెదకూరపాడు: మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో అధికారులు తిరుగుతూ ఫ్యామిలీ డాక్టర్, వయోజన బాలికలకు రక్తహీనత, ఫారం 6బీ, ఆధార్ సీడీంగ్ పురోగతి, కార్మిక సమీకరణ, ఆయుష్మాన్ భారత్, తదితర కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ మాగులూరి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వారి సమస్యలు అక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దారు క్షమారాణి, 75 త్యాళ్లూరు పీహెచ్‌సీవైద్య అధికారి డాక్టర్ ప్రియాంక, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



సత్తెనపల్లి: బాటసారులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సీపీ నాయకుడు మద్ది వేంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని గడియార స్థంభం సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు.ఈ మజ్జిగ పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. షమ్మి మాట్లాడుతూ ఎండాకాలం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం, అందులోనూ ప్రతి రోజు మజ్జిగ అందించడం చాలా మంచి కార్య క్రమంగా అభివర్ణించారు. కొత్త రామకృష్ణ సేవా కార్యక్రమాలల్లో ఎప్పుడు ముందు ఉండి నడిపిస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో స్వామి ప్రసాదు, భవిరిశెట్టి సుబ్రహ్మణ్యం, పొట్టి మురళి, నోముల రమణ, శ్రీను, చిలకల వాసు, కాకర్ల రమేష్, చారి, దేవరపల్లి రాఘవ, పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



సత్తెనపల్లి: నీటి నిల్వలు దోమలకు పుట్టిన ఇల్లు అని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె. రవీంద్ర రత్నాకర్ అన్నారు. పట్టణంలోని వడవల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 12వ సచివాలయం శాలివాహన నగర్ ఏరియాలో వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి శుక్రవారం ఆయన పర్యటించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగే తీరును పరిశీలించి ప్రజలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల్లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి వారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య సిబ్బంది, శానిటరీ సిబ్బంది, మలేరియా సిబ్బంది పాల్గొని ఇంటింటికి తిరిగి దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల యొక్క భాగస్వామ్యం తప్పనిసరి అని తెలియజేశారు. దోమల వల్ల కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోధకాలు వ్యాధి, మొదలైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, సత్తెనపల్లి రూరల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబహాన్‌బేగ్, మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ బి.రోశయ్య, వై.రాజేష్‌పాల్, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్ బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, హెల్త్ సెక్రటరీ గోవిందమ్మ, ఆశ కార్యకర్తకే భాగ్యలక్ష్మి, శానిటరీ సెక్రటరీ కె లక్ష్మీప్రసన్న, ఉన్నారు.

నేడు ఎర్రబాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రబాలెం(క్రోసూరు): క్రోసూరులోని ఎర్రబాలెం గ్రామంలో శనివారం సాయంత్రం నుంచి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతారని, జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఇంకా అందాల్సిన వారు ఉన్నారా తదితర విషయాలు అడిగి తెలుసుకుంటారని తెలిపారు. కావున పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు కార్యకర్తలు తప్పక పాల్గొన్నాలని కోరారు.

రైతుల ప్రయోజనాల కోసం కృషి చేయాలి

మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పొలం సాగునే నమ్ముకుని జీవించే రైతులకు మేలు చేసేలా వ్యవసాయ మార్కెట్ కమిటీ కృషి చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రథమ పాలకవర్గ సమావేశంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలకవర్గ సమావేశానికి కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. అలానే వ్యవసాయ మార్కెట్ కమిటీలు కూడా రైతాంగానికి అందుబాటులో ఉండి వారి వనరులను, ఆదాయాన్ని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు గ్రామం వద్ద, సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే ట్రాక్ వద్ద నూతనంగా రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేసేందుకు, పట్టణ పరిధిలో పశువుల సంతను ఏర్పాటు చేసేందుకు సమావేశం తీర్మానం చేసింది. అలాగే బహుళార్థక ప్రయోజనంగా శీతలీకరణ కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రతిపాదన జరిగింది. రైతులకు మేలు చేసే తీర్మానాలకు, కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ, సహకారం అందిస్తామన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. మంత్రి అంబటి రాంబాబును వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సమావేశంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కళ్ళం అంజిరెడ్డి, డైరెక్టర్లు, యార్డ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ.వి.భాస్కర రెడ్డి, అధి కారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

హై లెవల్ విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలి

మంత్రి అంబటి రాంబాబు



రాజుపాలెంలో యార్డునిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి అంబటిరాంబాబు

రాజుపాలెం: రైతులకు అవసరమైన వ్యవసాయమార్కెట్ యార్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, అడ్డుగా ఉన్న హైలెవల్ విద్యుత్ వైర్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. మండల కేంద్రమైన రాజుపాలెంలో రాజుపాలెం వ్యవసాయ మార్కెట్‌భవన నిర్మాణ స్థలాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మార్కెట్ యార్డు నిధులు రూ.65 లక్షలతో నూతన భవనాలు నిర్మించేందుకు గాను అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేసి, అడ్డుగా ఉన్న హైలెవల్ విద్యుత్‌వైర్లను తొలగించాలని విద్యుత్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అప్పటి వరకు తాత్కాలిక షెడ్డులోనే మార్కెట్ కమిటీ కార్యకలాపాలు కొనసాగించాలని సూచించారు. ఆయనతో పాటుగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరిశ్రీనివాసరావు, దొంతిరెడ్డిశ్రీనివాసరెడ్డి, తేలుకుట్లచంద్రమౌళి, మార్కెట్‌యార్డు నాయకులు కె.రమేష్, సర్పంచ్ పులిబండ్లఅశోక్, పల్నాడు జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాదు, మార్కెట్, విద్యుత్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు, యార్డు కార్యదర్శి ఆంజనేయసింగ్ తదితరులు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలు చేతివృత్తులతో రాణించాలి



తినుబండారాలను పరిశీలిస్తున్న చల్లంచర్ల, పక్కన కమిషనర్ షమ్మి, టీఎంసీ నాగేశ్వరి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణాలను వినియోగించుకొని స్వయం సహాయక సంఘాల సభ్యులు చేతివృత్తుల ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన శుక్రవారం ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పచ్చళ్ళు, అప్పడాలు, కొబ్బరి ఉండలు, అరిశలు, పలు రకాల ఆహార పదార్థాలను పరిశీలించి మాట్లాడారు.చల్లంచర్ల మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన ఆహార పదార్థాలను మార్కెట్లకు సరఫరా చేసి తద్వారా అధిక ఆదాయం పొందాలన్నారు. కమిషనర్ కొలిమి షమ్మీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రోత్సహించేందుకు విరివిగా రుణాలు అందిస్తుందన్నారు. రుణాలు తీసుకున్న సంఘ సభ్యులు వాటిని సక్రమంగా వినియోగించుకొని తద్వారా లాభాలు గడించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ నాగేశ్వరి, సిఓలు, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు ఉన్నారు.

పోలేరమ్మతల్లి వార్షికోత్సవం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో శ్రీపోలేరమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్ళు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో భాగంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

అంకమ్మ తల్లి పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

సత్తెనపల్లి: మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో శ్రీ అంకమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గణపతి పూజ, స్వస్తివాచనం, పంచగవ్యప్రాశన, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, మృత్స్యంగ్రహణం, అంకురా రోపణము, ద్వారాతోరణాద్వజకుంభారాధనలు, అగ్నిప్రతిష్ట పారాయణ హోమ ములు, కర్మాంగ స్నపనము భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొత్తం మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరగనున్నాయి.

ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు సన్నద్ధం కావాలి

పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



ప్రకృతి వ్యవసాయం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అమలకుమారి, ప్రకృతి వ్యవసాయ అధికారులు

దొడ్లేరు(క్రోసూరు): వచ్చే జూన్, జులైనెలల్లో తొలకరి వర్షాలకు నేలను దుక్కిదున్ని ఎకరాకు 13 కిలోల నవధాన్యాలు బీజామృతంతో విత్తన శుద్ధి చేసి పొలంలో వెదజల్లేలా రైతులను సిద్ధం చేయాలని పల్నాడుజిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజరు అమలకుమారి కోరారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో పకృతి వ్యవసాయం వల్ల ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు హాజరైన ఆమె మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో 50 రోజుల వ్యవధిలో వచ్చిన పంటలను పశువులకు మేతగా వేయడం లేదా పొలంలో కలియదున్నడం చేయాలన్నారు. తద్వారా భూమి జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావల్సిన పోషకాలు అంది పంట దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం సమకూర్చుతుందన్నారు. నవధాన్యాలనగా పచ్చిరొట్టపైర్లు (జనుము,జీలుగ, మినుము, పెసర), పప్పుజాతి(మినుము,పెసర, బొబ్బర్లు,చిక్కుళ్లు,)నూనెజాతి(నువ్వులు,ఆముదం, వేరుశనగ)ధాన్యపుజాతి(రాగులు, మొక్కజొన్న, కొర్రలు,సామలు),ఇతర తీగజాతి అనప, ముల్లంగి, దోస, టామాట, పూలజాతి పూల బంతి ఇతరపంటల విత్తనాలు పంటపొలంలో చల్లుకోవచ్చునన్నారు. తీగజాతి కూరగాయలు చల్లుకుంటే 25 రోజుల నుంచి పంట కోతకు వస్తుందన్నారు. తద్వారా రైతుకు ఆదాయం, ఆహార బద్రత కూడా కలుగుతుందన్నారు. అదేవిధంగా పచ్చిగడ్డి వేసుకుంటే పశువుల మేతకు దోహదపడి పాల దిగుబడి పెరిగి వెన్న శాతం కూడా పెరుగి పాడిరైతుకు ఆదాయం సమకూరుతుందన్నారు. దొడ్లేరు రైతుభరోసా కేంద్రంలో 13 కిలోల నవధాన్యాల కిట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు తీసుకుని తమతమ పొలాల్లో సాగు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేసి ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, గుంటూరు రైతుసాధికారిక సంస్థ గుంటూరు శ్రావణి, టిఎల్‌పీ శరత్‌చంద్ర, క్రోసూరు డివిజన్ మాస్టర్ ట్రైనీ సైదయ్య, వీఏఏ దివ్య, కమల, యూనిట్ ఇన్‌చార్జి హాజరాబీ, ఐసీఆర్పీ సావిత్రి, రైతులు, సిబ్బంది, పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేస్తాం

ఏఓ సుగుణాబేగం



అచ్చంపేటలో తడిసిన మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న ఏఓ సుగుణాబేగం

అచ్చంపేట: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి 21 రోజుల్లో మద్దతు ధర చెల్లిస్తామని వ్యవసాయాధికారి షేక్ సుగుణాబేగం తెలిపారు. మండలంలోని అచ్చంపేట, తాళ్లచెరువు గ్రామాల్లో శుక్రవారం ఆమె తడిసిన మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. నష్టపరిహారం రావాలంటే పండించిన పంటలో కనీసం మూడవవంతైన నష్టం వాటిల్లితేకాని పరిహారం రాదన్నారు. అచ్చంపేట మండలంలో వర్షాలు తక్కువేనని అలా దెబ్బతిన్న పొలాలు లేవన్నారు. అయితే కోతకొచ్చిన పంటలు, కల్లాల్లో ఆరబెట్టిన పంటలు తడిసిపోయాయన్నారు. వాటన్నింటిని రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తామన్నారు. ఏజన్సీలు స్వయంగా వచ్చి పంటలను గొలుగోలు చేస్తారన్నారు. క్వింటాకు రూ.1930ల మద్దతు ధరకు కొనుగోలు చేసి, 21రోజుల్లో నగదు చెల్లిస్తారని చెప్పారు. అయితే రైతులు తప్పనిసరిగా ఈక్రాప్‌చేయించుకుని ఉండాలన్నారు. అలాంటి పంటలను మాత్రమే కొనుగోలు చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. ఆమె వెంట అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎనోష్‌బాబు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం పాక్షిక ధ్వంసం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామం లోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసి ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. విగ్రహానికి కుడి చేతి వెనక వైపు, కర్ర కొంత భాగాన్ని గుర్తు తెలియని దుండగులు పగలగొట్టే ప్రయత్నం చేశారు. దీనిపై దళిత సంఘాల నాయకులు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆచరణీయం



బుద్ధజయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ళ మల్లిఖార్జునరావు

అమరావతి: ప్రపంచానికి నాటి నుంచి నేటి వరకు బుద్ధుని బోధనలే ఆచరణీయమని రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్ రేగుళ్ళ మల్లిఖార్జునరావు అన్నారు. శుక్రవారం స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం వద్ద బుద్ధిష్ట్ సర్క్యూట్ ఆవరణలో దళిత బహుజనఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధుని 2567వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బుద్ధుని బోధనల్లో పంచశీలను ఆచరిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. భౌద్ధం ప్రజలు అచరించే విధంగా దాని గురించి సులువుగా సామాన్యలకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బౌద్ధ ధర్మ విద్యను అధ్యయనం చేస్తున్న మయన్మార్, వియత్నాం దేశాల బౌద్ధ బిక్షువులు, తొలుత భౌద్ధ ప్రార్థన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆచార్యనాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ స్వరూపరాణి తదితరులు భౌద్ధమత విశిష్టతను గురించి వివరించారు కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు కొరివి వినయకుమార్, మేళం భాగ్యారావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి యోగాశ్రమం అధ్వర్యంలో...

ప్రముఖ భౌద్ధకేంద్రంగా వెలుగొందుతున్న అమరావతిలో 2567వ బుద్ధ జయంతి ఉత్సవాలను శుక్రవారం స్థానిక యోగాశ్రమం ఆధ్వర్యంలో భౌద్ధ సాంప్రదాయను సారం ధాన్యకటకబౌద్ధ విహర ట్రస్టుచైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు నిర్వహిం చారు. కార్యక్రమంలో భౌద్ధమతాభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీసీలు ఉంటేనే విత్తన విక్రయాలకు అనుమతి

ఏడీఏ హనుమంతరావు



మాట్లాడుతున్న ఏడీ హనుమంతరావు

అచ్చంపేట: విత్తన విక్రయ డీలర్లు పీసీ (ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్)తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఫారం సీలను పీసీలలో నమోదు చేయించుకుని ఉండాలని ఏడీఏ(సహాయ వ్యవసాయ సంచాలకులు) వి. హనుమంతరావు తెలిపారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో శుక్రవారం విత్తన డీలర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుందని, డీలర్లంతా నాణ్యతా ప్రమాణాలను పాటించవలసి ఉంటుందన్నారు. తప్పనిసరిగా సీల్ ప్యాకింగ్ విత్తనాలనే విక్రయించాలని, లూజ్ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. స్టాక్ రిజిస్టర్స్ సక్రమంగా ఉండాలని, ఏరోజుకు అ రోజు స్టాక్, ధరల వివరాలను బోర్డులో ఉంచాలని చెప్పారు. అదేవిధంగా ఈపాస్ మిషన్స్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. అనుమతులున్న విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. రైతులకు మెరుగైన సేవలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, అందుకు అధికారులైన విత్తన డీలర్లు అయినా కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. కార్యక్రమంలో ఏఓ సుగుణాబేగం, వ్యవసాయ విస్తరణాధికారి నాయక్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎనోష్‌బాబు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆడిట్



శావల్యాపురం: 2022–23 ఆర్థిక సంవత్సరంలో 16వ విడత జాతీయ ఉపాధి హామీ పథకం పనుల నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ బృందాలు పారదర్శకంగా ఆడిట్ చేయాలని ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్లు 71 లక్షల 89 వేలు పనులు చేసినట్లు చెప్పారు. ఇందులో కూలీల వేతనం రూ. 4 కోట్లు 36 లక్షల 45 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.3 కోట్లు 35 లక్షల 44 వేలు వెచ్చించినట్లు చెప్పారు. ఏపీవో టి.పద్మజా, ఎస్ఆర్‌పీ పి.బుజ్జి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో జయించండి

మంత్రి అంబటి రాంబాబు



వికలాంగులకు త్రిచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వైకల్యాన్ని ఆత్మస్థైర్యంతో జయించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎంపిక చేయబడిన ఎనిమిది మంది ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగులకు రూ.7.2 లక్షల విలువైన ఎనిమిది మోటారు త్రిచక్ర వాహణాలను శుక్రవారం పంపిణీ చేశారు. రూ. 92 వేల విలువైన ఒక్కో వాహ నాన్ని రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం, వారి సౌకర్యార్థం ఉచితంగా అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును వికలాంగులు పూల మాలలు, దుశ్శాలువా లతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజ నారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బీ, జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, వ్యవసాయ సలహ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, వైఎస్ఆర్ సీపీ రాజుపాలెం మండల అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో జీవీ. సత్య నారాయణ, స్థానిక నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పీసపాడులో గ్రామోదయం



పీసపాడులో గ్రామోదయం కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శివరామయ్య



స్థానిక కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మండలస్థాయి అధికారులు

క్రోసూరు: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల అధికారులు పీసపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఏడుగంటలకు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య ఆధ్వర్యంలో మండల అధికారులు కలిసి గ్రామ సచివాలయం వద్ద నుంచి గ్రామ నడక కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా గర్భిణులు, బాలింతలను, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. నాడు–నేడు పనులు జరుగుతున్న బీసీ కాలనీ ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాల విద్యార్థుల గృహాలను సందర్శించి వుయ్ లవ్ రీడింగ్ ప్రోగ్రాంలో భాగంగా పిల్లలు వేసవిసెలవుల్లో దినసరి చర్యలను అడిగి తెలుసుకున్నారు. పుస్తకపఠనం అలవర్చుకునే విధంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియచెప్పారు.అదేవిధంగా గ్రామంలో ఓటుకు ఆధార్ జత చేయనివారికి వెంటనే ఆధార్‌సీడింగ్ చేయించుకోవాలనిచెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరుగుతున్న సబ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ రోగులకు పరీక్షిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్పీ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

మాదలలో గ్రామోదయం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ పాఠశాలలో నాడు–నేడు లో జరుగుతున్న అభివృద్ధి పనులను మండల స్థాయి అధికారులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఎనీమియా తో బాధపడుతున్న వారి వద్దకు వెళ్లి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తల్లులకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహార కిట్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎస్సీ కాలనీని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సైదా, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమాదేవి, ఈఓపీఆర్డీ రూపవతి, ఎంఈఓ ఒంగోలురాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పలు శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు కానాలపుల్లారెడ్డి, వెంకటరెడ్డి, చిమటాశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి

నరసరావుపేట టౌన్: విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. బీసీ కాలనీకి చెందిన షేక్ నసీమ్(18) రెడ్డినగర్ 2వ లైన్‌లో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. డ్రిల్లింగ్ మిషన్ తీసుకొస్తుండగా ప్రమాదవశాత్తు జారి విద్యుత్ సరఫరా అవుతున్న తీగపై పడ్డాడు. కరెంట్ షాక్ తగిలి స్పృహ కోల్పోయాడు. గమనించిన కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి బాధితుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున వైద్యశాలకు చేరుకున్నారు. భవన యజమానిపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు.

గుర్తుతెలియని మహిళ మృతి

నరసరావుపేట టౌన్: గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన నరసరావుపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. వన్‌టౌన్ ఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన కథనం ప్రకారం.. మార్కెట్ సెంటర్ సమీపంలోని సాంబశివ ఫర్నిచర్ దుకాణం వద్ద సుమారు 60ఏళ్ల మహిళ మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిరాలి తలభాగంలో గాయం ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతిరాలి ఆనవాళ్లు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వేసవిలో లోతుదుక్కులతో ఉపయోగాలు

క్రోసూరు: రైతుసోదరులు వేసవి(ఏప్రిల్–మే) నెలల్లో కురిసే అడపాదడపా వర్షాలను సద్వినియోగ పరుచుకుని మెట్ట, మాగాణి, బీడు భూములను దున్నుకోవాలని ఏఓ వేణుగోపాల్ శుక్రవారం కోరారు. ఏఓ తెలుపుతూ అలా చేయడాన్ని వేసవి దుక్కులు అంటారని, వాటివల్ల లాభాలున్నాయని తెలిపారు. లోతు దుక్కులు చేయడం వల్ల పంట నష్టం కలుగచేసే గడ్డి ,తుంగ, ఎండ తీవ్రతకు నశిస్తాయని అన్నారు. ఎండ తీవ్రత వల్ల వాటితాలూకు విత్తనాలు, లేదా గింజలు నశించి ప్రధానపంటకు కలుపుబెడద తప్పుతుందన్నారు. లోతు దుక్కుల వల్ల పంటను ఆశించే చీడపురుగులు లద్దెపురుగు, పచ్చపురుగు, వేరుపురుగులు, గులాబీపురుగులు, నిద్రావస్థలో నేలలో ఉన్నవి బయటకు వస్తాయని, వాటిని పక్షులు తినటంవల రైతులకు చీడపీడ బెడద తగ్గుతుందన్నారు. వాటితో పాటు పంటను ఆశించే వివిధ తెగుళ్లు యొక్క శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయన్నారు. లోతు దుక్కుల కారణంగా అవి బయటపడి ఎండతీవ్రతకు వ్యాధిని కలిగింప చేసే శక్తి నశించిపోతుందన్నారు.క్షార నేలలు సరిచేసేందుకు లోతుదుక్కులు ఉపయోగపడతాయన్నారు. రైతులు లోతుదుక్కుల ప్రయోజనాలు తెలుసుకుని తగు విధంగా పంటపొలాలను సారవంతం చేసుకోవాలన్నారు.